క్లుప్తంగా

ఎంపీ టికెట్ 'సోయం'కే ఇవ్వాలి

ఇచ్చోడ: ఆదిలాబాద్ బీజేపీ పార్లమెంట్ టికెట్ సిట్టింగ్ ఎంపీ సోయం బాపురావుకే ఇవ్వాలని తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి కొడప నగేశ్ డిమాండ్ చేవారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సోయంకు టికెట్ ఇవ్వకపోతే తుడుందెబ్బ ఆధ్వర్యంలో తగిన బుద్ధి చెబుతాన్నారు. సమావేశంలో ప్రధాన సంఘం డివిజన్ అధ్యక్షుడు గేడం నగేందర్, తుడుందెబ్బ మండల అధ్యక్షుడు సిడాం మురళికృష్ణ, పుల్లేడు భీముడు పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బందికి సన్మానం

బోథ్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా మహిళలకు ఉచితం బస్సు ప్రయాణం కల్పించి 100 రోజులు గడుస్తున్న సందర్భంగా సోనాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఆర్టీసీ సిబ్బందిని ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గాజుల పోతన్న, అమతరావు పాటిల్, సంఘపాల్, విశ్రాంత ఉపాధ్యాయులు నర్సయ్య, విజయ భాస్కర్‌రెడ్డి, అనిల్ పాల్గొన్నారు.

వారసంతలో సౌకర్యాలు కల్పించండి

బోథ్: బోథ్ మండల కేంద్రంలో ప్రతీ మంగళవారం నిర్వహించే వారసంతో సౌకర్యాలు కల్పించాలని పక్షి ప్రేమికుడు జక్కుల వెంకటేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. లక్షల్లో ఆదాయం వస్తున్నా.. వారసంతలో కనీస సౌకర్యాలు లేవన్నారు.

లోక్ అదాలత్ విజయవంతం చేయండి

బోథ్: న్యాయవాదులు, పోలీసులతో బోథ్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి హుస్సేన్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శనివారం నిర్వహించే లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని కోరారు. రాజీకి అవకాశమున్న కేసులు, బ్యాంకు నేరాల కేసుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు, పోలీసులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ

బోథ్: మండలంలోని ఘన్‌పూర్ గ్రామంలో ఉపాధిహామీ పథకంలో భాగంగా రూ.3 లక్షలతో నిర్మించే సీసీరోడ్డు నిర్మాణానికి దేవులనాయక్ ఎంపీటీసీ సునీత రోహిదాస్ శుక్రవారం భూమిపూజ చేశారు. నిధులు కేటాయించినందుకు ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఎంపీపీ తుల శ్రీనివాస్‌లకు ధన్యవాదాలు తెలిపారు.

జైనథ్: మండలంలోని దీపాయిగూడ గ్రామంలో రూ. 3 లక్షల నిధులతో నిర్మించనున్న గ్రావెల్ రోడ్డు పనులకు ఎమ్మెల్యే పాయల్ శంకర్ భూమిపూజ చేశారు. శుక్రవారం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చేలకు వెళ్లే రోడ్డుకు భూమిపూజ చేసి, పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ లోక కరుణాకర్ రెడ్డి, అశోక్ రెడ్డి, రమేశ్, రాజు, ఆశన్న పాల్గొన్నారు.

తాంసి: మండల కేంద్రంలో ఎంపీ నిధులతో నిర్మించే మట్టి రోడ్డు పనులకు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సంతోష్ రెడ్డి భూమిపూజ చేశారు. రూ.6 లక్షల నిధులతో దుర్గామాత ఆలయం నుంచి చెరువుకట్ట వరకు, ట్యాంక్ నుంచి భీమన్న చెట్టు వరకు పంటచేలకు నిర్మించే రోడ్డు పనులను రైతులతో కలిసి ప్రారంభించారు. వారి వెంట రైతులు అశోక్, పొచ్చారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, రాంరెడ్డి, రవి పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి అందజేత

తలమడుగు: పీఆర్టీయూ తెలంగాణ సంఘం ప్రధాన కార్యదర్శి నవీన్‌యాదవ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మండలంలోని లింగి కేజీబీవీ విద్యార్థులకు శుక్రవారం పరీక్ష సామగ్రి అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. జిల్లా అధ్యక్షుడు ఆడే నూర్‌సింగ్, జిల్లా ఉపాధ్యక్షుడు రూపావత్ దినేష్, వేణు, మేకల రవికాంత్, కేజీబీవీ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు పకడ్బందీగా నిర్వహించాలి

ఇచ్చోడ: పారిశుధ్య పనులు పకడ్బందీగా నిర్వహించాలని ఇచ్చోడ మేజార్ పంచాయతీ ప్రత్యేకాధికారి ఎంపీడీవో లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఉదయం పారిశుధ్య పనులను పరిశీలించారు. ప్రతీరోజు ఇచ్చోడ పంచాయతీ పరిధిలో పారిశుధ్యం నిరంతరం నిర్వహించాలన్నారు. రోడ్లపై చెత్త వేసే దుకాణదారుడిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీవో సాయిప్రసాద్, తదితరులు ఉన్నారు.

చట్టాలతో మహిళలకు రక్షణ

గుడిహత్నూర్: చట్టాలతో మహిళలకు రక్షణ లభిస్తుందని జిల్లా సఖీ కేంద్రం నిర్వాహకురాలు సరస్వతి, మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త యశోద అన్నారు. సఖీ కేంద్రం అందిస్తున్న సేవలపై గురువారం మండలంలోని పూనగూడ కేజీబీవీ పాఠశాలలో కౌన్సిలింగ్ సేవలు, న్యాయ సహాయం, పోలీస్, వైద్య సేవలు, తాత్కాలిక వసతి గురించి వివరించారు. సఖీ కేంద్ర సిబ్బంది నాగమణి, ఎస్‌వో లావణ్య, బోధన సిబ్బంది పాల్గొన్నారు.

యథేచ్ఛగా తోడేస్తున్నారు

- ధనార్జనానే ధ్యేయం
- చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు
- గాలిలో కలుస్తున్న నిండు ప్రాణాలు


మొరం తవ్వడంతో ఏర్పడిన భారీ గుంత

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ డివిజన్‌లోని పలు మండలాలతో పాటు ఆదిలాబాద్ నియోజకవర్గంలో యథేచ్ఛగా క్వారీల నుంచి మొరం తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ భూములని చూడకుండా చెట్లను తొలగించి మొరం తోడేస్తున్నారు. మొరం తవ్విన గుంతలతో ప్రజలకు, మూగజీవాలకు ప్రమాదం పొంచి ఉంది. తవ్విన చోట ఏర్పాడిన పెద్ద గుంతలకు కనీసం కంచె ఏర్పాటు చేయకపోవడంతో నిండు ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి.

ప్రభుత్వ భూమిలో జోరుగా తవ్వకాలు

ఆదిలాబాద్ రూరల్ మండలంలోని నిషాన్‌ఘాట్ శివారులో ప్రభుత్వ భూమిలో గత కొన్ని రోజులుగా మొరం తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. పేదలకు ఇంటి స్థలాలు ఇచ్చేందుకు ఆదిలాబాద్ పట్టణానికి సమీపంలో ప్రభుత్వ భూములు లేవు. లాండసాంగ్వి గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గంలో నిషాన్‌ఘాట్ శివారు ప్రాంతంలో ఇంటి స్థలాలు లేని పేదలకు ఇంటి స్థలాలు ఇచ్చేందుకు ప్రజాప్రతినిధులతో పాటు ఆర్డీవో వెళ్లి భూమిని పరిశీలించారు. ఇప్పటికే అక్కడ కొంత మంది పేదలు గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్నారు. ఆ భూమిలో యథేచ్ఛగా మొరం తవ్వకాలు కొనసాగుతున్న అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు.

పలు ఘటనలు..

స్పందించాల్సిన రెవెన్యూ అధికారులు చూసిచూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆదిలాబాద్ డివిజన్‌లోని తలమడుగు మండలంలోని దేవాపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థులు 2021 అక్టోబర్‌లో మొరం క్వారీలో ఈత కోసం వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందారు. – ఇటీవల యాపల్‌గూడ ప్రాంతంలో బహిర్భూమికి వెళ్లి ఓ విద్యార్థి నీటిలో మునిగి మృతి చెందారు. ఆ సమయంలో హడావుడి చేసిన అధికారులు ఇప్పుడు మాత్రం ఏమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

చర్యలు శూన్యం..

గతంలో అక్రమ మొరం తవ్వకాలపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులను సస్పెండ్ చేసిన అధికారులు, ప్రస్తుతం మండలంలో ఆయా ప్రాంతాల్లో యథేచ్ఛగా మొరం తవ్వకాలు సాగిస్తున్నా.. చర్యలు తీసుకోకపోవడంలో అంతరాయం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం గతంలో భూమిలేని నిరుపేదలకు అందించిన అసైన్డ్ భూముల్లో యథేచ్ఛగా తవ్వకాలు చేపడుతున్న పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మొరం అక్రమ తవ్వకాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు. నిషాన్‌ఘాట్ శివారులో మొరం తవ్వకాలు చేపడుతున్న విషయంపై ఆదిలాబాద్ రూరల్ తహసీల్దార్ దిలీప్ కుమార్‌ను 'సాక్షి' ఫోన్‌లో సంప్రదించగా సిబ్బందిని పంపించి రెండు టిప్పర్‌లను సీజ్ చేయడం జరిగిందన్నారు. అక్రమ మొరం తవ్వకాలు చేపడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్


సాఫ్ట్‌బాల్ పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నేరడిగొండ: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. 8వ తెలంగాణ రాష్ట్ర సబ్ జూనియర్ ఇంటర్ (బాలికల) జిల్లా సాఫ్ట్‌బాల్ పోటీలను శుక్రవారం మండల కేంద్రంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు క్రీడల పట్ల ప్రతిభ కనబర్చి జిల్లా పేరును రాష్ట్ర, జాతీయ స్థాయిలో నిలబెట్టాలని ఆకాంక్షించారు. అనంతరం ఎమ్మెల్యే క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీలు రాథోడ్ సజన్, తుల శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల కన్వీనర్ అల్లూరి శివారెడ్డి, తిరుమల్‌గౌడ్, సాబ్లే నానక్‌సింగ్, రవీందర్ రెడ్డి, ప్రతాప్‌సింగ్, గులాబ్ సింగ్ పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పశువైద్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉచిత గాలికుంటు నివారణ టీకా శిబిరాన్ని ప్రారంభించారు. ఏప్రిల్ 5వరకు పశువైద్య శిబిరాలు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా పశువైద్యాధికారి రామారావు, నేరడిగొండ పశువైద్యాధికారి సుశీల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి పాటుపడాలి

ఆదిలాబాద్‌రూరల్: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేస్తూ మండలాభివృద్ధికి పాటుపడాలని ఎంపీపీ గంద్రత్ రమేశ్ అన్నారు. శుక్రవారం ఆయన అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని ఆదిలాబాద్ పట్టణంలోని ఎంపీడీవో సమావేశ మందిరంలో నిర్వహించారు. శాఖల వారీగా ప్రగతి నివేదికలను అధికారులు చదివి వినిపించారు. ప్రజాపాలనలో 200 లోపు విద్యుత్ యూనిట్ల కోసం దరఖాస్తు చేసుకున్న చాలా మంది వినియోగదారులకు జీరో బిల్లు రావడం లేదన్నారు. అధికారుల తప్పిదంతో వినియోగదారులు నష్టపోయే అవకాశం ఉందన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద గ్రామాల్లో చేపడుతున్న సీసీరోడ్డు, మురికి కాలువల నిర్మాణాల్లో కాంట్రాక్టర్లు నాణ్యత పాటించడం లేదన్నారు. వేసవి ప్రారంభమైనందున నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం యాపల్‌గూడ పంచాయతీ కార్యదర్శిని ఉన్నతాధికారులకు సరెండర్ చేయాలని తీర్మానం చేశారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలన్నారు. నీటిఎద్దడి తలెత్తకుండా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. సమావేశంలో కోఆప్షన్ సభ్యుడు ఆరీఫ్, ఎంపీడీవో నాగేశ్వర్ రెడ్డి, తహసీల్దార్ దిలీప్ కుమార్, ఎంపీవో వెంకటరాజు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దు


అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి సాగర్

నేరడిగొండ: పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న దృష్ట్యా విద్యార్థులు ఒత్తిడికి గురికావద్దని నేరడిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎండీ సద్దాం అన్నారు. శుక్రవారం మండలంలోని లఖంపూర్ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు అవగాహన కల్పించారు. పరీక్షల సమయంలో ఆహారపు అలవాట్లతో పాటు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉత్తంరావు, మండల ఆరోగ్య పర్యవేక్షకులు రాం నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చోడ: విద్యార్థి దశలోనే జ్ఞాపక శక్తిని పెంపొదించుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సాగర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ఉపాధ్యాయులు పాఠాలు బోధించే సమయంలో ఏకగ్రత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడిని జయించాలి

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు మానసిక ఒత్తిడిని జయించాలని హమాలీవాడ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి అవినాష్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని తాటిగూడ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షలు సన్నద్ధత.. ఒత్తిడిని జయించే మార్గాలనే అంశాలపై విద్యార్థులకు వివరించారు. పరీక్షలకు వెళ్లేటప్పుడు సమయపాలన పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సమన్వయకర్త రణిత, ఆశ కార్యకర్త అరుణ, ఉపాధ్యాయులు సంజయ్, రవికాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

బేల: పరీక్షల సమయంలో పదో తరగతి విద్యార్థులు ఒత్తిడికి గురి కాకుండా జాగ్రత్తలు పాటించాలని బేల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, కేజీబీవీలో పదో తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇన్‌చార్జి హెచ్ఎం రాజ్‌కుమార్, కేజీబీవీ ప్రత్యేకాధికారి గేడం నవీన, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి


కేక్‌కట్ చేస్తున్న జోగు రామన్న

ఆదిలాబాద్‌రూరల్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని తాలూకా మున్నూరు కాపు సంఘ భవనంలో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహిళలతో కలిసి కేక్ కట్ చేసి వారికి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మహిళలను శాలువాతో సత్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పురుషులతో సమానంగా మహిళలు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో తాలూకా మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు విఠల్, కౌన్సిలర్ సంద నర్సింగ్, ప్రభ, జోగు రమ, సంధ్య పాల్గొన్నారు.

భూమిపూజ

ఆదిలాబాద్‌రూరల్: మావల మండలంలోని వాఘాపూర్ గ్రామంలో ముఖ్య కూడలి వద్ద ఏర్పాటు చేయనున్న హైమాస్ట్ లైటింగ్ ఏర్పాటుకు జెడ్పీటీసీ నల్ల వనిత శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జెడ్పీ నిధులతో రూ. 5 లక్షల వ్యయంతో హైమాస్ట్ లైటింగ్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దర్శనాల సంగీత ఏవన్, ఎంపీటీసీ ఈశ్వరి, నల్ల రాజేశ్వర్, రాజ న్న, గోవర్ధన్ రెడ్డి, విలాస్ రెడ్డి, నారాయణ, అశోక్, మహేశ్ పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే అభివృద్ధికి కృషి

బేల: ప్రజల సహకారంతోనే అభివృద్ధికి కృషి చేశామని తాజా మాజీ సర్పంచ్ పెందుర్ శారద రాందాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని సదల్‌పూర్ గ్రామంలో సర్పంచ్ దంపతులతో పాటు ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులకు శాలువా కప్పి, మెమొంటో అందజేశారు. కార్యక్రమంలో ఎంపీవో మహేష్‌కుమార్, ఎంపీటీసీ కొడపే అరుణ్, సిడాం కుషాల్‌రావు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

టీజీ ఆర్‌డీసీ సెట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: తెలంగాణ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ప్రవేశం కోసం నిర్వహించనున్న టీజీ ఆర్‌డీసీ సెట్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జీఈ ప్రభుజ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. సాంఘిక సంక్షేమ, గిరిజన, మహాత్మా జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల ఆధ్వర్యంలో 2024– 25 విద్యా సంవత్సరానికి డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశం కోసం టీజీ ఆర్‌డీసీ సెట్‌ను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఏప్రిల్ 12లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 28న ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు.

రైతుల అభివృద్ధికి పాటుపడతాం

నేరడిగొండ: రైతుల అభివృద్ధికి పాటుపడతామని బోథ్ ఏఎంసీ ఉపాధ్యక్షుడు ఆడే వసంత్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ సాబ్లే కిషోర్ సింగ్‌లు అన్నారు. శుక్రవారం పీఏసీఎస్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సంఘ వివరాలను సీఈవో బారే నాగభూషణం చదివి వినిపించారు. రైతులకు రుణాలు ఇవ్వడంతో పాటు వ్యాపారాలు చేసుకునేవారికి సైతం రుణాలు ఇస్తామన్నారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి సంఘ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. బోథ్ ఏఎంసీ ఉపాధ్యక్షుడిగా ఆడే వసంత్‌రావు నియామకం కావడంతో పీఏసీఎస్ సంఘ చైర్మన్‌తో పాటు డైరెక్టర్లు సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కలాలి వెంకట రమణ, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఉపాధిహామీ కూలీల సంఖ్య పెంచాలి


ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో

తాంసి: గ్రామాల్లో చేపడుతున్న ఉపాధిహామీ పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీవో మోహన్ రెడ్డి సూచించారు. శుక్రవారం జామిడి గ్రామంలో చేపడుతున్న ఉపాధిహామీ పనులలను పరిశీలించారు. కూలీల హాజరు, చేపడుతున్న పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున ఉదయం సమయంలో పనులు చేపట్టే విధంగా చూడాలన్నారు. తాగునీటి వసతితో పాటు సౌకర్యాలు కల్పించాలని పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్‌ను ఆదేశించారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శి అనిత, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీహరి, తదితరులు ఉన్నారు.

పశుపోషణతో ఆర్థిక అభివృద్ధి


గాలికుంటు నివారణ టీకా వేస్తున్న పశువైద్యాధికారి

ఇచ్చోడ: పశుపోషణతో రైతులు మరింత ఆర్థికంగా అభివృద్ధి సాధించవచ్చని పశువైద్యాధికారి గోవింద్ నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని ముఖరా(బి)లో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ప్రతీ రైతు వ్యవసాయానికి అనుబంధంగా పశుపోషణను అభివృద్ధి చేసుకోవాలన్నారు. మండల వ్యాప్తంగా పశువైద్య శాఖ ఆధ్వర్యంలో గాలికుంటు టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గాడ్గే సుభాష్, మాజీ సర్పంచ్ మీనాక్షి పాల్గొన్నారు.

తలమడుగు: రైతులు వ్యవసాయంతోపాటు పశుపోషణపై దృష్టి పెట్టాలని మండల అధ్యక్షురాలు కల్యాణం లక్ష్మి రాజేశ్వర్, కేవీకే ప్రోగాం కోఆర్డినేటర్ ప్రవీణ్ అన్నారు. శుక్రవారం మండలంలోని సకినాపూర్, లచ్చమ్‌పూర్, పల్లి గ్రామాల్లో పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. వేసవికాలంలో పశువులకు వచ్చే వ్యాధులను అరికట్టేందుకు పశుసంవర్ధకశాఖ గాలికుంటు టీకాలు వేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి దూద్‌రాం రాథోడ్, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


ర్యాలీ నిర్వహిస్తున్న చిన్నారులు, అంగన్‌వాడీ టీచర్లు

తాంసి: గర్భిణులు, చిన్నారులు పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అన్నపూర్ణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ అభియాన్‌లో భాగంగా పోషణ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం పోషకాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సరితా రెడ్డి, భాగ్యలక్ష్మి, మమత, విజయలక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయురాలు రంజన పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: గర్భిణులు, బాలింతలు ప్రతీరోజు పౌష్టికాహారం తీసుకోవాలని ఏసీడీపీవో వినూత్న అన్నారు. పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని పిట్టబొంగరం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాపించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనిత, పోషణ అభియాన్ కోఆర్డినేటర్ పురుషోత్తం, పంచాయతీ కార్యదర్శి రమేశ్, భగీరథ, శుభద్ర, తదితరులు పాల్గొన్నారు.

బోథ్: మండల వ్యాప్తంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్షోత్సవాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం మండలంలోని ధన్నూర్(బి)లో సూపర్‌వైజర్ లలిత ఆధ్వర్యంలో గర్భిణులకు, బాలింతలకు, కిశోర బాలికలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

'వైద్యుడిపై చర్యలు తీసుకోవాలి'


ఆందోళన చేస్తున్న పిట్టబొంగరం గ్రామస్తులు

ఇంద్రవెల్లి: ప్రజలకు వైద్య సేవలు అందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైద్యుడిపై చర్యలు తీసుకోవాలని పిట్టబొంగరం గ్రామస్తులు శుక్రవారం ఆసుపత్రి ఎదుట ఆందోళన చేశారు. వారానికి ఒకసారి ఆసుపత్రికి వస్తున్నాడని ఆరోపించారు. కేవలం కిందిస్థాయి సిబ్బంది మాత్రమే వైద్య పరీక్షలు చేస్తున్నారని వాపోయారు. ప్రజల ఆరోగ్యాన్ని పట్టించుకొని వైద్యుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ వెంటనే పిట్టబొంగరం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి ఈవిషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో గ్రామపటేల్ వెట్టి రాజేశ్వర్, గ్రామస్తులు యేర్మ పైకు, వెట్టి జాకేశ్వర్, సిడాం భీంరావ్, మడావి ఇంద్రదేవ్ పాల్గొన్నారు.

31లోగా లక్ష్యాలను పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఎల్‌డీఎం భాస్కర్ ప్రసాద్

ఆదిలాబాద్‌రూరల్: ఆయా ఆర్థిక సంవత్సరంలో బ్యాంకుల వారీగా అందించనున్న రుణాల లక్ష్యాలను ఈనెల 31లోగా పూర్తి చేయాలని లీడ్ బ్యాంకు మేనేజర్ భాస్కర్ ప్రసాద్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలోని ఆదిలాబాద్ రూరల్ ఎంపీడీవో సమావేశ మందిరంలో వివిధ బ్యాంకు మేనేజర్‌లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఐటీడీఏ ద్వారా మంజూరైన రుణాలను ఆర్థిక సంవత్సరం ముగింపులోపు లబ్ధిదారులకు అందించాలన్నారు. సమావేశంలో డీపీఎం శోభరాణి, ఎంపీడీవో నాగేశ్వర్ రెడ్డి, పలు బ్యాంకు మేనేజర్లు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎదులాపురం/ఆదిలాబాద్‌రూరల్: విద్యుత్ ఉప కేంద్రాల మరమ్మతుల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని పలు విద్యుత్ ఉప కేంద్రాల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు ఎస్ఈ జేఆర్ చౌహాన్ ఒక ప్రకటనలో తెలిపారు. జీఎస్‌నగర్ ఉప కేంద్రం పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రాంపూర్, పొచ్చెర, దిమ్మ జందాపూర్, భీంసరి ప్రాంతాలకు సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. కైలాస్‌నగర్ ఉప కేంద్రం పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శాంతినగర్, ఓల్డ్ హౌజింగ్ బోర్డు, ఆర్ఆర్ కాలనీ, కుమ్మరివాడ, పాలిటెక్నిక్, ఫిల్టర్‌బెడ్ ఏరియాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే ఖానాపూర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఖానాపూర్, రాణిసతీజీ కాలనీ, అశోక్‌రోడ్డు, కోలిపూర్, బొక్కలగూడ ప్రాంతాలకు సరఫరా ఉండదన్నారు. రాంపూర్ ఫీడర్ పరిధిలోని ఖుర్షీద్‌నగర్, రణదీవెనగర్, సుందరయ్యనగర్, నీలానగర్, గాంధీనగర్, రాంపూర్‌లలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

వర్ధంతి సభ విజయవంతం చేయండి

ఆదిలాబాద్‌టౌన్: భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి సభలను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హరీష్, గణేష్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో వర్ధంతి సభలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. ఈనెల 15 నుంచి 31 వరకు వర్ధంతి సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశంలో ఫాసిజం పెరిగిపోయిందన్నారు. విద్యను కాషాయికరణ చేయాలనే ఉద్దేశంతో బీజేపీ ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. ప్రశ్నించే గొంతుకలపై కేసులు నమోదు చేయిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు మనీష్, రాజు, అశోక్ పాల్గొన్నారు.

గోడం నగేశ్‌కు ఘన స్వాగతం

నేరడిగొండ: బీజేపీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్ బీజేపీలో చేరి, ఎంపీ అభ్యర్థిగా మొదటిసారి జిల్లాకు వచ్చిన సందర్భంగా మండలంలోని రోల్‌మామడ టోల్‌ప్లాజా వద్ద శుక్రవారం బీజేపీ జిల్లా అధ్యక్షులు పతంగే బ్రహ్మానందం, నేరడిగొండ మండల ప్రధాన కార్యదర్శి సాబ్లే సంతోష్ సింగ్, మండల నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం భారీ ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలోని అంబేద్కర్, కుమురం భీం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు రాములు, నారాయణ, ప్రశాంత్, గంగారెడ్డి, శంకర్, గంగాధర్, ప్రవీణ్, నవీన్, శ్రీను, పృథ్వీరాజ్, సురేశ్, అభిలాష్, ప్రభాకర్ పాల్గొన్నారు.